Reg. No 757

అభినవసరస్వతి

యను నొక మాసపత్రిక.

జానపాటి పట్టాభిరామశాస్త్రిచే

ప్రచురింపఁబడుచున్నది.

జానపాడు.

సంపుటము 17 { 1925 సం॥ డిసెంబరు నెల } సంచిక 9

విషయములు.

చందానిర్ణయము సంవత్సరమునకు

ప్రధానపోషకులకు రు 25 0 0. సహాయులకు రు 5 0 0

పోషకులకు రు 10 0 0 చందాదారులకు 3 0 0

Printed at the Chandrika Press, Guntur,
and published at Janapadu by the Editor, Astavadhani
Janapati Pattabhirama Sastry.

ప్రధానపోషకులు.

౧ శ్రీ శ్రీ జగద్గురు విరూపాక్ష స్వాములవారు, వెనికేపల్లి.
౨ శ్రీ శ్రీ జగద్గురు పుష్పగిరి స్వాములవారు, వైకుంఠపురం.
౩ బాకరాజు పరాంకుశరావుదేశ[illegible]గారు. యాడవరం.
౪ రామశింగుగారు- నెల్లుట్లసాపురసంస్థానముల మేనేజరు- నెల్లుట్ల.

పోషకులు.

౧ శ్రీ శ్రీ జగద్గురు అభినవ విరూపాక్ష పీఠాధిపతులు.
౨ ఎనమండ్ర లక్ష్మీనరసింహముగారు, మర్చెంటు, బెజవాడ.
౩ రాజా వెంకటాద్ర్యప్పారావు, బహదరుగారు, వుయ్యూరుయెస్టేటు.
౪ రాజా మంత్రిప్రగడ వెంకటహనుమంతరావు, రాఘవరావుగార్లు, లింగగిరి.
౫ తంగెడ నరసింహారావుగారు, కరణం, మోర్జంపాడు.
౬ శ్రీరామయాంబికా పుస్తకభాండాగారము, లక్ష్మీనర్సాపురము.
౭ లింగాల వెంకటరెడ్డి దేశముఖుగారు, కుందవరము
౮ చారబుడ్డి రత్నారెడ్డిపటేలుగారు, న్యాలపోగుల
౯ లింగాల సీతారామరెడ్డి బండారెడ్డి, దేశముఖుగార్లు- నారాయణపురము
౧౦ టి. లక్ష్మణసింగుగారు, జోనగాం
౧౧ నెల్లుట్ల నరసింహారావుగారు, జోనగాం
౧౨ రంగాచార్యులుగారు, ముక్త్యారు, దేశముఖు, మసీదుపల్లె.
౧౩ చేకులపల్లి కృష్ణారెడ్డిగారు, కేశవాపురము.
౧౪ జాగర్లమూడి కుప్పస్వామినాయుడుగారు, కారంచేడు
౧౫ పిశుపాటి వెంకటరాయశర్మగారు, కరవది
౧౬ యార్లగడ్డ రంగనాయకులు నాయుడుగారు, కారంచేడు
౧౭ శ్యామాపంతుల వెంకటేశ్వరరావుగారు, తహశీల్దారు, సిరిసిళ్ల.
౧౮ గూడూరి వీరసాంబశివరావు సర్దేశపాండ్యాగారు, మానెకొండూరు
౧౯ పొట్లపల్లి జగన్నాథరావు దేశముఖుగారు, అశ్వారావుపల్లె

సహాయులు

౧ వావిళ్ల వెంకటేశ్వరశాస్త్రిగారు, చెన్నపట్టణము.
౨ బుడంపాటి సుబ్బయ్యగారు, మర్చెంట్, కాకినాడ
౩ సంగెం రామారావుగారు, సంగెం
౪ పెద్దిభట్ల వీరయ్యగారు, ప్లీడరు బెజవాడ
౫ నెల్లుట్ల కేశవరావు దేశముఖుగారు, నెల్లుట్ల
౬ రంగావఝ్ఝల రంగయ్యగారు, నర్సారావుపేట
౭ నారాయణరావుగారు, దాతారుపల్లె

అభినవసరస్వతి

సంపుటము ౧౭ { జానపాదు. క్రోధన సం॥ మార్గశిరమాసము } సంచిక ౯

ముద్దులమూట.

ప్రగల్భుఁ డిట్లుపన్యసించెను:—

ఈనడుమ నూరలేను. శ్రీశైల మల్లిఖార్జునస్వామిని సేవింప మహాభక్తులందఱు పరమభక్తితో నేగుచుండ నేనుగూడ నాస్వామిని దర్శించి కృతార్థుఁడను గావలెనను కోర్కెతో బయలుదేఱితిని. సోదరులారా ! మంచికార్యము కడుగడుగునను విఘ్నములు. వెళ్లినప్పుడింకను వలసినంత కాలము కలదుగదాయని బెజవాడ రైలుస్టేషనులో రైలుదిగి జన్మము తరియింపఁ గృష్ణానదీపవిత్రోదకముల స్నానమాడి పాన మొనర్చి యొక సత్రిపుటరుగుపైఁ గూరుచుండ నొక ముదుసలి బ్రాహ్మణుఁడు ... నాసమీపమునకు వచ్చి ' నాయనా! బ్రాహ్మణుఁడవఁయి పుట్టితివి. స్నానమొనర్చి యీపాడుమొగముతోఁ బితృకర్మ మొనర్చు వానివలెఁ గూర్చుండుటకంటె నీదేనుతమో కాసంత విభూతియో రవ్వంత తిరుమణిశ్రీచూర్ణములో యిసుమంత గోపీచందనమో యంగారమో ధరించిన యేమంతప్రమాదము వచ్చును. అయ్యయ్యో! అనన్యలభ్యమగు భరతఖండమందు జన్మమంది పావనతర గోదావరీ కృష్ణవేణీసలిలంబులే రక్తమై, మాంసమై, మెదడై, నరములై, యెముకలై, రోమరోమకూపములై విరాజిల్ల నవతరించిన నీవు నాది యాంధ్రదేశమని రొమ్ముకొట్టుకొని చెప్పఁగల్గిన నీవు మృదుమధురమై శిరీషకుసుమ పేశలమై, సర్వవిధముల స్వాధీనమై యానందదాయకమగు నాంధ్ర

భాష పునశ్చరణ యొనరించు నీవు స్నానమొనర్చి, తలఁదుడిచికొని, తెల్లని స్వదేశవస్త్రములు ధరించి రవ్వంత విభూతి ధరింప శరీరము వంగినది కాదా? ఆకొండపై కేగి కనకదుర్గ దర్శించి యాతల్లి పాదపూజ నొనర్చి రవంత కుంకుమ రేఖ కనుల కద్దుకొని కనుబొమల నడుమ ధరింప వీల్లాకపోయినదా? లేదా యీదిక్కునను్న శివకేశవుల యాలయముల కరిగి దేవతాదర్శనమున ధన్యుఁడవయి, విభూతియో శ్రీచూర్ణమో యించుకంత ధరియించివచ్చిన నీమొగ మెట్లుండెడిది? బొట్టులేదు. నీకాచారవ్యవహారములులేవు. నీవు బ్రాహ్మణుఁడవా? అన నంత కోపమువచ్చు నీవు బ్రాహ్మణత్వము సిద్ధించు పద్ధతి నేల విసర్జిం చితి వని యేకమ్మస్వాములవారైన నిన్నుఁ బ్రశ్నించిన యెడల నా మహామహునితో నేమని చెప్పఁగలవు? ముందుగా నీవిభూతి ధరించి మఱియు మాటాడుము. నాయనా! మీదే గ్రామమో? యడుగమర చితిని' యనుటతోడనే విభూతి నొసట ధరియించి "అయ్యా! తాము పెద్దలు. చిన్నలమగు మాయెడ యత్కించి దపరాధమున్న క్షమి యింపవలయును. మాది గోదావరీతీరస్థమగు కుమారపురమను పల్లె యూరు. ఇప్పుడే 9 గంటల రైలుదిగి వచ్చినాను. రాత్రియంతయు రైలునందుఁ గొందఱు మొన్న కాకినాడలో జరిగిన కాంగ్రెసు తీర్మా నములపైఁ జర్చచేసిచేసి క్రమముగా రెండుకక్షులయి మేము కూర్చున్న పెట్టె యొక్కటియే కాక రైలంతయు మాఱుమ్రోగఁ గలహించుటచేఁ గనుమూయుటకైన నవకాశము లేకపోవుటచే శరీర మవశమై చల్లని తల్లి కృష్ణవేణియందు స్నానమాడి యిటునటు నడుగిడలేక రవ్వంత సేపు విశ్రమింతమని యిచ్చటకు వచ్చితి"ననగా నావృద్ధుఁడు క్రమక్రమ ముగా సమీపించి "రాత్రి కాకినాడ కాంగ్రెస్సుచర్చ రైలులో నేల

రావలసివచ్చినది? ఏనాఁటి కాంగ్రెస్సు ? ఏనాఁటిచర్ఖ ? మధ్య వీరి కీ తగవులెందులకు? నీకిచ్చట నిద్రయెట్లును బట్టదు లే. దానిసారము నాలుగు ముక్కలు తెల్పుము ...... నేను బోయెదను. నీవు శయనింతువులే" యని యత్యాసక్తినడుగ ... ముసలిం గాంచి యిట్లని చెప్పితిని. 'ఆర్యా ! మఱేమిలేదు. మూఁడవతరగతి రైలుబండియందు ... ... గూర్చుండిన యొక ముసలిబ్రాహ్మణుఁడు మంచినీటిచెంబును దప్పిన యొక నల్లని యాతనిఁగాంచి "యట్లు తన్నితోనెదవేమి? కన్నులు కన్పింపవా? నీవెవరవు?" అని యన్నంత 'అప్పుడుకాదు. ఇప్పుడు తన్నుచున్నాను; ఏల నీకుఁ బనికిరావు? నేనెవ్వఁడనో యెఱుంగుదువా? నేనాదిమాంధ్రుఁడను. సరిగామాత్రము మాటలు రానిమ్ము' అని చేయియెత్త నాబ్రాహ్మణుఁడు 'మీరంతవారని యెఱుఁగను నాయనా! ఇఁకమాత్రము తన్నకు' మనెను. అంత గాంధిటోపి ధరియించిన యొక దేశభక్తుఁ డావృద్ధబ్రాహ్మణు సమీపించి 'యయ్యా! మీవంటివారు యావజ్జనులగు నెడల కేపుసాయంత్రమునకు స్వరాజ్యమువచ్చును. ఇంక నాచారపిశాచము పీకుకొని తినుచున్నది. అట్లాదిమాంధ్రసోదరులు సమీపించి, వారు స్పృశించిన యుదకము పుణ్యానదీ జలతుల్యముగాఁ దమవంటి పెద్దలు భావించుటచే నేఁడే స్వరాజ్యమువచ్చినది' అని పలుక నాముసలి "అయ్యా! ఆదిమాంధ్రులనఁగా అయ్యరు లేనా? అయ్యరుల నీరు మనము త్రాగినఁదప్పా?" అన నాయువకుఁడు, "అయ్యరులుకారయ్యా! పంచములు, అస్పృశ్యులు, మాల సోదరులు" అని చెప్పుటతోడనే యాస్థవిరుఁడు "అయ్యో! అయ్యో! మాలముండాకొడుకా నీటిని ముట్టుకొన్నవాఁడు" అని యానీటి నిక్షాలఁ బాఱఁబోసి నిర్వాణపడియుండ నంత నాదేశభక్తుఁడు దౌర్జన్య

రహిత సహాయ నిరాకరణ వాదియయ్యెఁ బట్టరాని యావేశముతో "నదియేమయ్యా! మాలలు స్పృశియించిరనియేనా యానీటిని బాఱఁ బోసికొంటివి. మొన్న కాకినాడకాంగ్రెసుకు నీవు రాలేదుకాబోలు! వచ్చిన నిట్టిపనిచేయుదువా? ఎవరైన నీవలె నిట్లొనరింపఁ జూచి సహింతువా? ఆహాహా యేమికాంగ్రెసు! యేమియైక్యత! యేమి సర్వసమానధర్మము! భోజనములవద్దనేమి? స్నాన పానములవద్ద నేమి! ప్రాతినిధ్యమునయేమి! వర్ణభేదమనికాని స్త్రీపురుష భేదమని కాని యించుకంత కన్పడెనా? ... ఇట్టి యైక్యతకంటె స్వరాజ్యమే మున్నది. ... అట్టివి కొన్ని చూచినఁ గాని యిట్టి ఛాందసము వదల నేరదు. మన పంచమసోదరులను మనమే నీచులఁగా జూచిన నిఁక నెట్లు స్వరాజ్యము వచ్చును? గాంధిమహాత్ముఁడిట్టి భేదములు నశింప నిదే స్వరాజ్యము రాదని చెప్పియున్నాఁడు. అందరు నేకమతము వారము కావలెను. "నీవు నేను" అను భేదభావము నశింపవలెను." అని చెప్ప మొదలిడఁగనే పైనున్న బల్లమీఁద పరుండి యుండిన యొక సన్యాసి, కాషాయాంబరధారి దిగ్గునలేచి కూర్చుండి యిట్లుపన్యసింపఁ దొడంగెను, 'దేశభక్తుఁడవైన నాయనా! నీవు చెప్పుచున్నది గాంధి మతమా? ... సాంకర్య మొనరింపఁదలంచికొనిన దేశభక్తుల, దేశ బాంధవుల, దేశహితుల, మాయలకు లోనై కాని కూడుఁ గుడుచుట యేకాక ... యీసాంకర్యము, సాపైనది, న్యాయమైనదని వ్యాఖ్యా నముకూడ నొనరించుచుంటివా? ... నీవు చెడినదియేకాక యందఱఁ జెఱుపఁజూచుచుంటివా? "నేను ఖైదునందు దినిరాలేదా?" అంటివే నీప్రారబ్ధము నీచేఁదినిపించినది. అట్టియవసరము, అట్టిప్రారబ్ధము పట్టిన నాఁడు నీబోధలెవ్వరికిఁ గావలయును? ... ఈమాత్రమునకా యెవరో స్పృశించిన జలమును బరిహరించిన యాముసలివిప్రుని నట్లు నిందించి

తివి ? నీవా నాతండ్రి మాకందఱకు జ్ఞానోపదేష్టవు. నీవా మానాయకుఁడవు? నానాయనా! నీవంటివారు, నీకన్న బుద్ధిమంతులు మాకు నాయకులగుటచేతనే యిట్టి యౌన్నత్యము నందుచున్నాము. నీవంటి సాంకర్యప్రియులు నాయకులగుటచేతనే మాలవానిచే బ్రాహ్మణునకు హస్తోదక మిప్పింపఁబడినది. అన్యదేశములందిట్టి నియమము లేదు కావుననే వారికెల్లరకు స్వరాజ్యము వచ్చినది. మనకీబాధచేతనే యదిరాలేదనియా పల్కుచుంటివి ఈవిషయమై యిదివరకు వివేకానందుఁడఱచి యఱచి యావత్ప్రపంచమునఁ జాటి యాత్మైక్యమొందియున్నాఁడు. వినలేదా నేను జెప్పెదను వినుము.

"ఇతరదేశములలోని ప్రజలయందు మతమున్నదికాని నాదేశము, నాప్రజలు, నేనుగూడ మతమందే యున్నాము. ఇతరదేశస్థులు దినమున కొకమతము వంతునఁ దండ్రి యూదుమతము, కొడుకు మహామదు మతము, కూతురు నాస్తికమతము; ఇట్లు వేఱువేఱు గ్రహించినఁ దప్పులేదు. ఆక్షేపణమేమియు లేదు. హిందూదేశమున మతమును విడనాడినచోఁ దన సంఘమునకు దూరస్థుఁడగును." అనియును "స్వేచ్ఛకొరకు ఫ్రాన్సువారును, భోగముల కమెరికావారును, పదార్థపరిశోధనార్థము, జర్మనీ, జపానువారును, ధనముకొఱ కింగ్లీషువారును, ప్రాణములనైన నెట్టియ సంసిద్ధులయియుందురో మతముకొఱకు హిందూదేశమట్టిది" యనియుఁ దెల్పిన వాక్యములు చూచిన, వినిన నిట్లు పలుకఁగలవా ? ... ...

అన్నివర్ణము లొక్కటి చేయనెంచి బ్రాహ్మసామాజికులున్న వర్ణములకంటె నింకొక క్రొత్తసంఘము సృష్టించిరే! అట్లు చేయుట సాధ్యమగునేని వైష్ణవమతమని వేఱుగా నొక కొందఱు విడివడియుండఁ గారణ

మేమి? చెల్వపిళ్ళరాయని రాతివిగ్రహమును నడిపింపనేర్చిన రామానుజునకు స్వాధీనముకాని యీమైక్యము నీవు చేయఁగలనని యెంచితివా? ఉన్నమతమును యథాస్థితిగా బాగొనరింపక యుందింకొక చీలికయా మీయైక్యతకు ఫలము. నేఁపు మాగ్రామము నీవంటి యేప్రచారకుఁడైనవచ్చిన వానికి వీధిలో భోజనముపెట్ట నిశ్చయించుకొన్నారే! స్వరాజ్యము పట్టణములయందు లేదు. పల్లెలనుండి రావలె ... అట్టి పల్లెలయందు మీమాటకుఁ జలామణి లేనప్పుడు మీరెట్లు స్వరాజ్యము తేఁగలరు? ఇంకను నేల రొమ్ముజఱచికొని పల్కెదవు. మా మతమే పోయిన తరువాత మాకు స్వరాజ్యమెందులకని యెవరేని నడుగ నేమని ప్రత్యుత్తరమిత్తువు. పోనిమ్ము దానికేమి యింకొక్కమాట. ఈదేశభక్తులు, నీదేశబంధువులు, నీలోకపూజ్యులు, నీసాంకర్యదీక్షాచార్యులు, వీరందరు నుపన్యాసవేదికలపైనుండి యింతింత లుపన్యాసములు గంభీరముగా నొసఁగుచున్నారే! విదేశవస్త్రదహనము, స్వదేశవస్త్రధారణాదికము, ఖద్దరువ్యాప్తి, రాట్నపు మహత్వమును గూర్చి పరిపరి విధముల బోధనముసేయు వీరు ఎన్నడయిన నిప్పుడుకాదు, వెనుకకాదు మరెప్పుడైన రాటముమీఁద నొక్కదారఁదీసి యెఱుఁగురా? గుభగుభ యుపన్యాసములిచ్చుటయేనా? ఆచరించిన వారున్నారా? ... వీరిలో నొక్క " రిదిగో నేను స్వయముగా నూలు వడకి నేసికొని నావస్త్రము ధరించితి " నని చెప్పఁగలరా? రాటము చూచినయెడల నారాటము, దోరాటము పుట్టు దేశభక్తుల మాటలకు ఈగ్రామఘోనుమాటలకానందించుటయేకాని కార్యమాచరింపబడునా? ...నీవంటి నాయకశిరోమణులు మొన్న కాంగ్రెస్సునందు స్త్రీల శాంతిసైన్యముచుట్టు నాప్రదక్షిణముతేల చేయవలసివచ్చెను? త్రికరణశుద్ధిగా నొక్కమాట నీవు చెప్పుచున్నావా? ఈవిభూతిపెండెకట్లు, ఈ

బిళ్ళకచ్చలు, ఉచిటికెనవేలియంతటి పిలకలు, ఈరుద్రాక్షమాలలు, స్వరాజ్యము వచ్చుపర్యంతము మీదుకట్టబడి పెంచఁబడుచున్న యీ [illegible]

[illegible]

నాటక వేషములుగావు, యథార్థములని నీవు చెప్పఁగలవా? ఇది వఱకు నిత్యము నుభయసంధ్యలయందు దేవతాదర్శనముకంటె నెక్కువ ప్రీతిగా రెస్టరెంటుతూమున కేతెంచు వీరలు, చూచుచుండ నొక్క పర్యాయము నిరాహారులయిపోయినారా? హాట్, బూటు, ట్రవుజర్సు, ఎకసటారి ధరించి మోటారుబండినుండి భూమిమీద నడుగైన నుంచని మహాభోగులు నేటికిని స్వదేశీయవస్త్రము నే పంట్లాములుగాను వేస్టుకోట్లుగాను గుట్టించుకొని వానిని స్వదేశీహేట్‌తోగూడ ధరించు వీరు విషయసుఖత్యాగులయినారన్న నీకు నమ్మకమేనా? ఇట్టి దేశీయనాయకులు తత్రాపియాంధ్రులు సలిపిన యీసాంకర్యము తీర్మానము కంటె దేశమున కెక్కుడు పేరు తెచ్చునది. ... ఇట్టి వొకటిరెండు కాంగ్రెస్సులు జరిగినయెడల మూడవకాంగ్రెస్సునుండి "బ్రాహ్మణ

ఈమహాకార్యసారస్యవేత్తవగుటచేతనా? పరులు స్పృశించిన యుదకము పరిహరించిన యాపృగ్ధుని బరిహసించుచుంటివి. ఇదిమొదలు పదిమంది యున్నచోట మాత్రము నేను ఫలానా వ్యాపారములోని వాఁడనని చెప్పికొనకుము. దాహమై, కంఠ మిగురుచున్నను, నాలుక తడి యారుచున్నను గాసంత మంచినీళ్లైన నొసంగని యోగము రాఁగలదు. నివంటివారి కందఱకు దేశమునం దింతభక్తికల్గినది కావుననే స్వరాజ్య మీరీతిగా వెనుకనడలమీద నున్నది" అని ఆయన చెప్పుచుండ ... రైలుబండి యీస్టేషనునకు రాఁగా నాసన్యాసియు నేనును దిగినాము' అని నేనుజెప్ప నాముసలివిప్రుఁడు "నాయనా! కాకినాడ కాంగ్రెస్సులో నందఱుచేసిన తీర్మానము కొత్తది కలసి తినుటయేనా! ఛీ! ఈమాత్రమున కిన్నిలక్షలు ఖర్చెందులకు?" అని యడుగ "నయ్యా! అదికాదు. ఖద్దరు నిర్మాణము, రాజీనామాయను తీర్మానములు నింక నేవేవో జరిగినవి. అంతియేకాని సంకరభోజనముల తీర్మాన మింక నుపపాదించినవారు లేరు. కార్యముమాత్రము జరుగుచున్నది" అన నా ముసలి "మీరుచెప్పిన తీర్మానము లన్నియు వెనుకటి కాంగ్రెసులోనివేకదా? పీరుచేసిన మహాకార్య మీసాంకర్యమే యని తోఁచుచున్నది" యని యేమో చెప్పఁబోవ మాసుశీలునినుండి టెలిగ్రాము వచ్చినదని మాస్నేహితుఁ డొకఁడు బెజవాడ పురవాసి వెదకి వెదకి సత్రమునందు నన్నుఁబట్టుకొని టెలిగ్రాముఁ జేతికిచ్చినాఁడు. చూచుకొని రైలెక్కితిని. శ్రీశైలయాత్ర కిట్టి విఘ్నము కల్గినది కదా యని చింతిల్లుచు నింటికి వచ్చితిని. ... ...

విష్ణుభాగవతోపపురాణత్వప్రతిపాదనము.

అస్మదాచార్యవర్యులగు బ్రహ్మశ్రీ మహావాది పాండురంగ శాస్త్రిగారు దేవీభాగవతమహాపురాణత్వవిచారమను గ్రంథమును బ్రకటపఱచిరి. సుధీవరులు సమంజసముగానున్నదని సంతోషించిరి. కాని క్షీరసాగర గ్రామనివాసులగు మహారాజశ్రీ లక్ష్మారెడ్డిగారు మాత్రము తాము బ్రాహ్మణశిష్యులలోఁ జేరినవారైయుండియు బ్రాహ్మణులను నస్మదాచార్యవర్యులునునగు పై శాస్త్రిగారితోఁ గయ్యమున కియ్యకొనిరి. ఇతఃపూర్వ మిటులనే దేవీభాగవతమహాపురాణత్వవిచార మన్న మండిపడుచు శ్రీమద్భాగవతమహాపురాణత్వసిద్ధాంతమును జేయఁబూని కొంతమంది పురాణప్రమాణబాహుళ్యము లేమిచే నుపేక్షించిరి. అది గుర్తెఱింగియుఁ జర్వితచర్వణముగాఁ బిష్టపేషణముగాఁ లక్ష్మారెడ్డిగారు శాస్త్రిగారి వ్యాసమును ఖండన మొనరింప ముందునకు నడచి వ్యాకరణభంగ మున్నదనియు దేవీభాగవత శ్రీమద్భాగవత తారతమ్యము పూర్వమందే విచారణచేయఁబడియుండఁగా నిపుడు నవీనముగా శాస్త్రిగారు విచారణఁజేసి సిద్ధాంతముఁజేయఁబూనికొనిరా యనియు నీశాస్త్రిగారు చెప్పినదే మహాప్రసాదమని చెప్పి యెవరంగీకరింతురనియుఁ దమయిచ్చవచ్చిన ట్లుద్ఘాటన మొనరించిరి కాని శాస్త్రిగారు కనఁబఱచిన ప్రబల ప్రమాణములకు మాత్రము బదు లేమియుఁ జెప్పఁజాలరైరి. శాస్త్రిగారు "దేవీభాగవతం నామ పురాణం యత్తు పంచమ" మిత్యాది స్కాందాది మహాపురాణ ప్రమాణములఁ గొన్నింటి నాధారము చేసికొని దేవీభాగవత మష్టాదశమహాపురాణాంతర్గతమని కంఠసహస్రముగా నుగ్గడించుచు విష్ణుభాగవతవ్యాఖ్యయందుఁగల "అథతత్రభవాన్ వేదవ్యాసః నానాపురాణశాస్త్రప్రబంధై శ్చిత్తప్రశమన మలభమాన

స్తత్ర తత్రాపరితుష్య న్నారదోపదేశత శ్రీభగవద్గుణానువర్ణనప్రధానం
భాగవతశాస్త్రం ప్రారిప్సుః" అను శ్రీధరీయవాక్యములను "మహా
జనో యేన గత స్స పంథాః" యనునార్యోక్తిని చిరకాలమునుండియు
నున్న జగద్విఖ్యాతిని బరికించి శ్రీభాగవత ముపపురాణమనియు
వ్యాసోక్తమనియునే వ్రాసిరి కాని యన్యథా వ్రాసినవారు కారు. అట్టి
శాస్త్రిగారి సత్యాంశమును గ్రహింపలేక మా లక్ష్మారెడ్డి ప్రభృతి
సోదరపుంగవులు ఖండనమొనరింపసాఁగిరి. సరిసరి. నిజము నిలుకడ
మీఁదఁ దెలియును. విష్ణుభాగవతవిషయమై శాస్త్రిగారు వ్రాసిన
యంశములును దత్ఖండనములును నట్లుండనిండు. తచ్ఛిష్యుఁడనైన
నేను ప్రమాణాంతరములనుండి విష్ణుభాగవతము శుకోపదిష్టమనుటకుఁ
గూడఁ గలయసంగతముల లిఖించుచున్నాను. చదువరు లీదిగువఁ బ్రక
టింపఁబోవు ప్రమాణములఁ బఠించి సంతసింపఁగలందులకుఁ బ్రార్థితులు.

శ్రీమద్విష్ణుభాగవతమహాప్రమాణమునుండియే విష్ణుభాగ
వతము శుకోపదిష్టముకాదని బోధపడుచున్నది. తచ్ఛాస్త్రిగారి
యొక్కయు వైదికమతాచార్యులయొక్కయు శిష్యుఁడనైన నేనిపుడు
విష్ణుభాగవతగ్రంథప్రమాణమునుండియుఁ బురాణాంతరప్రమాణముల
నుండియు విష్ణుభాగవత ముపపురాణమని నిర్దేశించుచున్నానుగాన
నిఁకనైన మా రెడ్డిసోదరపుంగవులు సంతసించుదురుగాక. విష్ణుభాగవ
తము భగవద్గుణవర్ణనప్రయుక్తమైనది కాదనికాదు; ఋషిప్రోక్తమైనది
కాదనికాదు; వైదికమతాచార్య శిష్యులమైన మాకు విష్ణుపూజ
యత్యంతావశ్యకమైనది కాదనికాదు; కాని మధ్యప్రకల్పితమును దీసి
వేసి గ్రంథమును స్వీకరింపవచ్చును. శుకోపదిష్టత్వ మీగ్రంథమున
నాటుకొనియున్నది. ఏమహాపురుషులో యసత్యబీజావాపన మొన
రించి శుకముఖప్రబోధితమైనదని శుకులవారిజుట్టున కంటఁగట్టి యావ
లికి దాటిరి.

విష్ణుభాగవతము ౯స్కం॥ ౨౨ అ॥ ౨౫-వ శ్లోకములో శ్రీశుకులవారు రాజవంశ్యానుక్రమణికయందు భవిష్యద్రాజేతిహాసము చివరఁ బరీక్షిన్మహారాజును గూర్చి యిట్లుసెలవొసంగిరని తేలుచున్నది.

శ్లో॥ సకృత్వ్యాం శుకకన్యాయాం బ్రహ్మదత్త మజీజనత్
యోగీశో గవి భార్యాయాం విష్వక్సేన మధా త్సుతం॥

ఇందున కాంధ్ర భాగవతోదాహరణము

ఆ॥ శుకునికూఁతురైన సుందరిఁ గృత్విని
బొంది వేడ్క నీపభూవిభుండు
విమలయోగవిత్తు విజ్ఞానదీపితో
దారచిత్తు బ్రహ్మదత్తుఁ గనియె,

ఏతచ్ఛ్లోకపద్యాభిప్రాయ మెంతసొగసుగనున్నదో యరయుఁడు. తాను నిజముగా శుకుఁడేయైనయెడల నాకూఁతురని చెప్పక శుకకన్యయందు బ్రహ్మదత్తుఁడను తపోధనుఁడు జనించెనని పరీక్షిన్మహారాజును గుఱించి యేలచెప్పును? పరీక్షిన్మహారాజునకు భాగవతము నుపదేశించిన శ్రీశుకులవారే బ్రహ్మదత్తుని మాతామహులో లేక భాగవతములో శ్రీశుకులవారిచే నిర్ధారణచేయఁబడిన శ్రీశుకులవారేనో రసికవర్యులే గ్రహించుదురుగాకయని వేఁడుచున్నాను. ఇందుమీఁద మన రెడ్డిసోదరపుంగవు లేమిసమాధాన మొసంగుదురో చూతము. ఇదియునుంగాక మాత్స్యపురాణము ౧౫-వ యధ్యాయములో

శ్లో॥ మహాత్మానో మహాభాగా భక్తానా మభయప్రదాః
ఏతేషాం పీవరీకన్యా మానసీ దివి విశ్రుతా ౫

యోగినీ యోగమాతాచ తపశ్చక్రే సుదారుణం
ప్రసన్నో భగవాన్ తస్యాః వరం వవ్రేతు సా హరేః ౬

యోగవంతం సురూపంచ భక్తానా మభయప్రదం
దేహి దేవ ప్రసన్న స్త్వం పతిం మే వదతాంవరం ౭
ఉవాచ దేవో భవితా వ్యాసపుత్రో యదా శుకః
భవితా తస్య భార్యా త్వం యోగాచార్యస్య సువ్రతే ౮
భవిష్యతిచ తే కన్యా కృత్వీనామచ యోగినీ
పాంచాలాధిపతే ర్దేయా మానుషస్య త్వయా తదా ౯
జననీ బ్రహ్మదత్తస్య యోగసిద్ధాచ గౌ స్స్మృతా

౪౯-వ యధ్యాయములో

శ్లో॥ జజ్ఞే సర్వగుణోపేతో విభ్రాజ స్తస్య చాత్మజః
విభ్రాజస్యతు దాయాద స్త్వణుహో నామ వీర్యవాన్ ౧౧
బభూవ శుకజామాతా కృత్వీభర్తా మహాయశాః
అణుహస్యతు దాయాదో బ్రహ్మదత్తో మహీపతిః ౧౬
యుగదత్తసుత స్తస్య విష్వక్సేనో మహాయశాః

ఈపైన లక్ష్మారెడ్డిప్రభృతి మా రెడ్డిసోదరపుంగవులు పట్టిన పట్టును నిగ్గింపఁజేయఁబూని కేవల మద్వైతజ్ఞాననిష్ఠాగరిష్ఠులు నహంకార రహితులు నైన యాదివ్యపూరుషులు యుష్మదస్మచ్ఛబ్దాదిలౌకిక వ్యవహార కాండమునం దంత యాసక్తిగలవారలాయనియుఁ బారలౌకిక జ్ఞానమే ప్రధానముగాఁగలవారనియు నహంభావములేక యఃకశ్చన దేవదత్తయన్నట్లు తచ్ఛబ్దపూరితముగాఁ దమ వంశానుక్రమణికను బ్రబోధించిరనియుఁ బూర్వపక్షముఁ జేయుదురు కాఁబోలు. మనసోదరులవాక్కునే వ్యాసవాక్కని యించుకంతసేపు తలంతము. అటులైనను వక్ష్యమాణ శ్రీశుకవాక్యరత్నమునుండి యదియు భగ్నమగుచున్నది. విష్ణుభాగవతము నవమస్కంధము ౨౨వ యధ్యాయము,

శ్లో॥ హిత్వా స్వశిష్యాన్ పైలాదీన్ భగవాన్ బాదరాయణః
మహ్యం పుత్రాయ శాంతాయ పరం గుహ్యమిదం జగౌ ॥౨౨॥

ఇందుమీఁదనైన మార్కండేయాదిప్రభృతులు శంకాబాహుళ్యమును నివర్తింపఁజేసికొందురుగాక. ఆంధ్రభాగవతోదాహరణము.

ఆ॥ బాదరాయణుండు భగవంతుఁ డనఘుండు
పరమగుహ్యమైన భాగవతము
నందనుండనైన నాకుఁ జెప్పెను శిష్య
జనులమొఱఁగి, యేను జదువుకొంటి, ౬౭౦

పైపద్యంబులఁగనిన సామాన్యాక్షరజ్ఞానముగల బాలగోపాలురు నైతము శ్రీశుకులవారు ప్రాపంచికజ్ఞానముకలవారని యనకపోరు. ఇంతియగాక రసికాగ్రగణ్యులు పద్మపురాణోత్తరఖండస్థ కల్పిత శ్రీశుక వాక్యరత్నమును గాంచుఁడు.

శ్లో॥ నిగమకల్పతరోర్గళితం ఫలం
శుకముఖా దమృతద్రవసంయుతం
పిబత భాగవతం రసమాలయం
ముహు రహో రసికా భువి భావుకాః.

సభాస్థానమునకు శ్రీశుకయోగీంద్రులవారు వేంచేసి శ్రీశుకయోగీశ్వరులచేఁ జెప్పంబడిన భాగవతమును జెప్పఁబోవుచున్నానుగాన శ్రద్ధధానులై సభాసదులందఱు నీభాగవత తంత్రసారాయమును జుర్రుఁడని ముందఱఁబెట్టి చెప్పసాఁగిరఁట! శ్రీశుకులవారేలోకమునుండి వచ్చి చెప్పందొడంగిరో కొంచెమరయుఁడు. ఇంతటఁబోక శ్రీకృష్ణ నిర్యాణానంతరము ముప్పదిసంవత్సరములకు శ్రీశుకులవారు పరీక్షిన్మహారాజునకు భాగవతము బోధించిరనియు సప్తాహాహర్నిశములఁ దచ్ఛ్రవణమొనర్చి పరీక్షి త్తుత్తమలోకమునుబొంది లోకాతీతయశ

శ్శరీరుఁడై నిల్చియుండెననియుఁ బ్రస్తుతియొనర్చి వ్యాసోక్తనవాహ భాగవతయజ్ఞమునకు మాఖ సప్తాహ కార్యమును గల్పించి యేమహాపురుషులో పద్మపురాణోత్తరఖండస్థశ్లోకములలోఁ బావనహస్తములచే దూర్చి యంతర్హితులైరి. కావున మాలత్మ్యారెడ్డిప్రముఖు లేతత్ప్రబల ప్రమాణములనైన గ్రహించి సంజనితభ్రాంతిని దొలఁగఁజేసికొని సుఖాస్పదులై యుందురుగాక. శుకయోగి ధృతరాష్ట్ర పాండురాజాదులకంటెఁ బూర్వమే నిర్గుణనిరాకారనిరంజన బ్రహ్మైక్యమును బొందినటులఁ బ్రబలప్రమాణ మాంధ్రమహాభారతము శాంతిపర్వము ౬ వ యాశ్వాసము భీష్మాచార్యులవారినిగుఱించి యుధిష్ఠిరప్రశ్న.

వ॥ కృష్ణద్వైపాయనపుత్రుండనుమాత్రమే కాని శుకునిజన్మంబు తెఱింగును నతనితల్లిని నతండు బాల్యంబున మహానుభావుండగుటకుం గతంబును నతండు సిద్ధిఁబొందినభంగియు నెఱుంగ, నవియెల్ల నెఱింగింపుము, ౨౮౬

ఇందలి తుదిప్రశ్నకు భీష్మాచార్యు నుత్తరము.

వ॥ అయ్యవసరంబున సత్యవతీసుతుండు నిజసుతు వెనుక మహాయోగగమనంబు గైకొని తగిలె, నంతకు నయ్యారణేయుండు వాయుపథం బతిక్రమించి సర్వభూతాత్మకుండయ్యెనపుడు ౩౩౧

క॥ సురమునిసిద్ధగణంబులు
పరివేష్టింపంగ నతనిపాలికి గంగా
ధరుఁ డేగుదెంచి నెవ్వగఁ
బొరయునతనితోడఁ గరుణఁబొంపిరివోవన్ ౩౩౨

వ॥ అనునయపూర్వకంబుగా నిట్లనియె, ౩౩౩

క॥ "జలపవనాంబరవసుధా
నలసమవీర్యుఁడగు పుత్త్రు నాకొసఁగంగా

వలయునని యడిగి, తిచ్చితి
నలఘుతపోవిభవ ! యేను సట్టికుమారుఁ, 33౭

వ॥ వాఁడును మత్ప్రిభావంబునను భవత్తపోవిశేషంబునను బ్రహ్మతేజోమయుండై దేవతలకుం బొందరాని పరమగతిం బ్రాపించె. దీనం జేసి మోదంబునందవలదె, విషాదంబునకుం బనియేమి"యనిపలికి వెండియు 3౪౦

తే॥ " ఇలయు గిరులును శరధులు నెంతదాఁకఁ
గలుగు నంతకాలంబును వెలయుచుండు
శుకునికీర్తియు నీదు యశోవిభూతి
యును జనంబులవీనుల కుత్సవముగ " 3౪౧

వ॥ అని నిర్దేశించి "వలయునేని పుత్రసదృశమైన ఛాయ నిన్నెప్పుడు ననుగమింప దర్శించువాఁడవుగా" కనియె, నిట్లనుగ్రహించి యాబ్రహ్మర్షివరుని సంప్రీతునింజేసి వీడుకొల్పి విశ్వేశ్వరుండు నిజేచ్ఛంజనియె, నింతవట్టు నారదుండు నాకుం జెప్పె, 3౪౨

అని యిట్లు భీష్మాచార్యులవారు శరతల్పగతులైయున్నతఱి ధర్మరాజును గుఱించి నారదమహర్షివలననుండి శ్రీశుకకైవల్యప్రాప్తిని విస్పష్టముగాఁ దానువిన్నటుల వక్కాణించిరి. శ్రీశుకయోగివర్యులు బ్రహ్మదత్తుని మాతామహులైనట్లు గ్రంథాంతరప్రమాణము. బ్రహ్మాండపురాణము, ఉపోద్ఘాతతృతీయపాదము, ౧౦ అధ్యాయము.

శ్లో॥ శ్రీమాన్ వ్యాసో మహాయోగీ యోగస్తస్మిన్ ద్విజోత్తమాః
వ్యాసా దరణ్యాం సంభూతో విధూమఇవ పావకః॥ ౮౭
పరాశరకులోద్భూత శ్శుకో నామ మహాతపాః ౭౭
స తస్యాం పితృకన్యాయాం పీవర్యాం జనయే ద్విభుః
పుత్రాన్ పంచయోగచర్యాన్ పరిపూర్ణాన్ పరిశ్రుతాన్॥

కృష్ణం గౌరం ప్రభుం శంభుం తధా భూరిశ్రుతంచవై
కన్యాం కీర్తిమతీంచైవ యోగినీం యోగమాతరం ౮౧
బ్రహ్మదత్తస్య జననీ మహిషీ త్వణుహస్యతు
ఆదిత్యకిరణోపేత మపునర్మార్గ మాస్థితః ౮౨
సర్వపాపవినిర్ముక్తో భవిష్యతి మహామునిః

లింగపురాణము, ఉత్తరభాగము, ౧౮ అధ్యాయము, త్ర్యంబక మంత్రి పఠనశ్రవణఫల వైశేష్యము.

శ్లో॥ సాక్షాత్సనత్కుమారేణ సర్వలోకహితైషిణా
పారాశర్యాయ కథితం పారంపర్యక్రమాగతం॥ ౧౦
శుకే గతే పరంధామ దృష్ట్వా రుద్రం త్ర్యంబకం
గతశోకో మహాభోగో వ్యాసః పరఋషిః ప్రభుః॥ ౧౧

ఇందునకు నీలకంఠాచార్యోక్తి॥ రుద్రందృష్ట్వా శుకే పరంధామ మోక్షపదం గతే ప్రాప్తే యంకథా భారతేపి స్మృతా. ఇటుల త్ర్యంబకరుద్ర మంత్రమాహాత్మ్యమునుండికూడ శ్రీశుకయోగి పరీక్షిద్రాజు కాలమువఱకు లేడని దృఢముగాఁ దెలియవచ్చుచున్నది. కావున విష్ణుభాగవతమునకు శుకోపదిష్టత్వము కల్పితమనుటకు సందేహము లేదు. అది యుపపురాణమనుటలో మేమును సమ్మతించుచున్నవారము. లక్ష్మారెడ్డి ప్రభృతి సోదరపుంగవు లివిష్ణుభాగవతోపపురాణత్వ ప్రతిపాదనమును వీక్షించినవెంటనే భాగవతగ్రంథమనఁగా నెట్టిదియో యేయేధర్మవిశేషములతో విలసితమైనదియో యేధర్మముల నాచరించువారలు భాగవతసాంప్రదాయకులో కింకించిన్న్యూనంకితులు భాగవతవర్యులో చక్కఁగావిమర్శించి ప్రమాణపూరితముగాఁ దెలుపఁ బ్రార్థించుచున్నాము. తెలిపినయెడల భాగవతాచార నిర్ణయమును జేతనైనంతవఱకు మేముగూడ విమర్శకుఁ దీసికొందుము.

—♦ నారసింహమంత్రప్రభావము ♦—

చం॥ అవతలఁ గొంత కాలమున కంబుజమిత్రకులప్రసూతుఁడై
తవునవఁ దేజరిల్లు సురథక్షితిపాలుఁడు భ్రష్టరాజ్యుఁడై
యవనిసురాగ్రగణ్యుఁడగు నాత్మపురోహితు నవ్వసిష్ఠు పా
దవనజయుగ్మమందుఁ బడి తాఁ గడు దైన్యముతోడ నిట్లనెన్, ౬౪౦

ఉత్సాహము॥ మామకీనమైనయట్టి మంచిచెడ్డలరసి బి
ట్టోముచుండునట్టినీవి టుండఁగానె విద్విష
ద్భూమిపతులు నాదురాజ్యమున్ హరించి రయ్యయో!
యేమటంచుఁ జెప్పుదున్ మహీసురేంద్ర! కావునన్ ౬౪౧

తే॥ భాగ్యహీనుండనైన నాపయి ననుగ్రహించి రాజ్యము మగుడ లభించుమార్గ
మెడఁదయోజింపవలయును ఋషికులాగ్రగణ్య! నీకన్నగతి నాకుఁ గానఁబడదు ౬౪౨

వ॥ అనియిట్లువచించుటయు వసిష్ఠుండు ౬౪౩

తే॥ "అట్టులగుచో మదుక్తంబు నాలకించి యఖిలసిద్ధిప్రదాయకమైనయట్టి
హాటకేశ్వరమునకునీ వరుగు సరగ సురథభూపాల! యత్యంతసుగుణజాల! ౬౪౪

తే॥ అరిగి ద్విభుజోద్యతోగ్రకరాలాగ్రవిద్ధదీర్ఘపీనాంధకాసుర దేహుఁడగుచు
భైరవాకారముననుండు పార్వతీశు నటఁ బ్రతిష్ఠించి పూజింపు మధికభక్తి, ౬౪౫

ఆ॥ రక్తపుష్పములను రక్తానులేపనంబులను ధూపములను బూని నార
సింహమంత్రమునను జేయుము తత్పూజ, బలయుతుండవగుచుఁ బగరఁద్రుంతు ౬౪౬

క॥ కరముశుచియగుమనుండుము సురథా! తత్పూజసల్పుచో, లేకున్నన్
దొరలెడుఁ బ్రత్యూహంబులు, చిరమువిచారించి నిజముచెప్పినవాఁడన్" ౬౪౭

వ॥ అనినవిని యారాజతిత్వరితంబునఁ దత్క్షేత్రంబునకుంబోయి భైరవుం బ్రతిష్ఠించి శుచియై బ్రహ్మచర్యంబునఁ బదివేలనారసింహమంత్రంబు జపించుటయు భైరవుండు సంతుష్టుండై ౬౪౮

క॥ "ఏతన్మంత్రజపంబునఁ బ్రీతింబొందించితీవు పృథివీధవ! నన్,
నాతోడఁ జెప్పుకొనుమిఁక, నీతలఁపు నొసంగువాఁడ నిశ్చయముగ నేన్" ౬౪౯

వ॥ అనివక్కాణించుటయు సురథుండిట్లనియె, ౬౫౦

ఉ॥ "వైరులు నాదురాజ్యమును వచ్చి బలోత్కృతిమై హరించి, ర
వ్వారల సంహరించి యది వైళమ నాకు ననుగ్రహించుచున్
వేల్పొకఁడే యీమనువు వేయుపరు ల్జపియించుచోనిటన్
గూరిమి వారివాంఛితముగూడ నొసంగుచునుండు భైరవా!" ౬౫౧

వ॥ అని వేఁడుటయు భైరవుండు వల్లెయని యంతర్ధానంబుఁజెందె, సురథుండు రణంబున రిపువుల రూపుమాపి నిజరాజ్యంబు గైకొనియె ” ననిన విని మునీశ్వరులు.

—• చ క్ర పా ణి ప్ర తి ష్ఠ •—

సీ॥ “ఇంద్రాదిక శ్రేష్ఠబృందారకులు లోకహితమునకై సృజియించినవియు
సల విభీషణపురోగామరారులచేత భక్తిమై రచియింపఁబడినయవియు
హనుమదాది కపీశు లరుదెంచి సంప్రీతి మంచిగా నేర్పఱిపించినవియు
భీష్మాదులెందఱో పేర్నిల్పుకొనుటకై మిగులశ్రద్ధను వినిర్మించినవియు
నైన తీర్థదేవతాయతనంబులు వేనవేలు మాకు విశదపఱచి
నావు, మఱియు దర్శనస్పర్శనములనే యొవి యభీష్టదములో యీవు చెపుమ ”
వ॥ అనవుడు సూతుండిట్లనియె, ౬౫౪

తే॥ “ వాస్తవంబిది సంయమివర్యులార ! యచటఁగల యాలయంబుల యాశ్రమముల
లింగముల లెక్కఁ జెప్పంగలేను నేను, బ్రహ్మకేని యసాధ్య మిప్పని తలంప,

వ॥ అందు శంఖతీర్థంబున సమాహితుండై యేకాదశిని స్నాతుఁడగువాఁడు సమస్తఫలంబులం బొందఁగలిగెడిఁ, బ్రొద్దుపొడుపునలేచి శ్రద్ధాభక్తి సమన్వితులై జనులు సిద్ధేశ్వరసమానులగు నేకాదశరుద్రుల దర్శించిన సకలరుద్రులను వటాదిత్యుని దర్శించిన ద్వాదశాదిత్యులను మాహిత్థనుదర్శించిన సకలదుర్గలను స్వర్గద్వారప్రదుండగు వినాయకుదర్శించిన సకల వినాయకులను శర్మిష్ఠప్రతిష్ఠించిన జ్యేష్ఠగౌరినిదర్శించిన సకలగౌరులను జక్రపాణినిదర్శించిన సకలవిష్ణుమూర్తులను దర్శించినవారలగుదు ” రని యిట్లు వాక్రుచ్చుటయు శౌనకాదులు ౬౫౬

తే॥ ‘ఈవుచెప్పినవానిలో నింతవఱకుఁ జక్రపాణి చెలంగఁ డాస్వామి నెవఁడు
తాఁ బ్రతిష్ఠించె ? నెట్టిది తత్ప్రభావ ? మెపుడుతద్దేవు దర్శించి యొరఁగవలయు’?
వ॥ నావుడు సూతుండిట్లనియె, ౬౫౭

ఆ॥ “ అర్జునుండె నిలిపె నాచక్రపాణిని, శయనబోధనములఁ జని యుషస్సు
నందు నీరమాడి యాదేవు నీక్షింప బ్రహ్మహత్యయేని బాయఁగలదు, ౬౫౮

వ॥ భూభారోత్తారణమునకును ధర్మసంస్థాపనమునకును నరనారాయణు లుభయులును బ్రహ్మచే నవతరింపఁజేయఁబడిరి,యీనరనారాయణులే ద్వాపరాంతంబునఁ గృష్ణార్జునులై ధరాపృష్ఠంబునం దవతరించి పరస్పరాత్యంత స్నేహంబునం బ్రవర్తించిరి. రక్షోవినాశార్థమై దశరథాత్మజుండగు మ రాముండువో లెఁగృష్ణుండు నవతరించినవాఁ, డయ్యెడ యుధిష్ఠిరుచే నాజ్ఞాపింపఁబడి యింద్రప్రస్థపురంబునుండి యర్జునుండు తీర్థ

సేవనంబునకు వెడలియుండె, ధర్మజుం డట్టిలయాజ్ఞాపించెనన్నఁ జెప్పెదవినుండు, ద్రౌపదిసహితుండై రహస్థలమందున్న యన్నయగు యమనందను సందర్శించి యింద్ర నందనుండు ప్రణతుండును వినయావనతుండును నై ౬౬౦

తే॥ "మానవాధీశ ! విప్రులధేనువులను దోలుకొనిపోవుచున్నారు దొంగవాండ్రు, ఆదురాత్ములవధియించి యాల మలప, వలయు నాయుధ, మంగుకై వచ్చినాఁడ"

వ॥ అనివిన్నవించుటయు యుధిష్ఠిరుండిట్లనియె, ౬౬౨

కం॥ "పొమ్ముధనంజయ! యచటికిఁ, జి మ్మాతస్కరుల నీదుశితశస్త్రమునన్, దెమ్ము మహీసురగోవుల, సమ్మతియిచ్చితిని లెమ్ము సత్వర మింకన్, ౬౬౩

చం॥ పరసతిఁ గన్నతల్లివలె భావనసేయు వివేకి యౌనుగా,
కొరుఁడు వివిక్తదేశమున యుగ్మలిఁగూడి వసింపఁ గాంచునో
హరహరయంచుఁ దొల్లవలె నావల, కట్లు తొలంగఁడేని దు
ష్పురుషుఁడె వాఁడు, పాపియును, జుట్టమెయైన నీఁకేమిచెప్పనా, ౬౬౪

తే॥ కాన నేకాంతమందునఁ గాంతతోడఁగూడివర్తించువానిని జూడఁగూడ,
దందు బంధువుఁజూచుట యతివిగర్హ్య, మాత్మహితకాంక్షి పాటింపనగునుదీని,

శా॥ ఏనున్ ద్రౌపది యొక్కశయ్య మనుచో నేతెంచితీ, వందునన్
ధేనువ్రాతము గ్రమ్మఱించుపిదపం దీర్థంబులం గ్రుంకిర,
మ్మీమనస్సంతయు ద్వాదశాబ్దములుగా నీఁగున్, ధరిత్రీజనం
బానౌనంచు నుతించు నిన్ను విజయా ! యావీఁకఁ గావించుటన్" ౬౬౬

వ॥ అని యిట్లు వచించుటయు వల్లెయని ధనుర్బాణంబులం గైకొని తత్క్షణంబ రథం బధిరోహించి శితశస్త్రధరులై ద్విజులఁ దిరస్కరించి దొంగలు గోవులఁ దోలుకొని పోవు మార్గంబునం జని వేగంబ వారి సంహరించి మహాత్ములగు బ్రాహ్మణులకు ధేనువుల సమర్పించి యనేకతీర్థంబులం దాడుచును ననేకాయతనంబుల దర్శించుచును బాండునందనుండు క్రమంబుగా నీ క్షేత్రంబునకు నరుదెంచె, నతఁడు పూర్వ మాక్షేత్రమును దఱచుగా నవలోకించియున్నవాఁడె, దుర్యోధనువివాహంబునకేగుచు నటు వచ్చియుండుట వినియుండరో కో, యంత మున్ను తాఁబ్రతిష్ఠించియున్న యర్జునేశ్వరలింగంబును బుష్పధూపానులేపనంబులం బూజించి కౌరవులును బాండవులును స్థాపించిన తక్కటిలింగంబులకును మ్రొక్కువెట్టి యాత్మగతంబున

కం॥ "నేను నరుండను, గృష్ణుఁడు శ్రీనారాయణుఁడు తాను, సిద్ధమిది, యటుల్
గాన నిటఁ జక్రపాణిని బూని ప్రతిష్ఠింతు జనులు పూజయొనర్పన్, ౬౬౭

తే॥ ఉర్విఁ గనివినియెఱుఁగని యొక్క గుడియు రాణఁ గట్టింతు నీచక్రపాణికిచటఁ
జెడదు కల్పాంతమునను నీక్షేత్రరాజ, మట్లె శాశ్వతమైయుండు నాలయమును"

వ॥ అని నిశ్చయించుకొని యాపాండవానుజుండు విష్ణ్వాలయంబు వినిర్మింపించి చమత్కారపురస్థులగు భూసురులఁ బిలువంబంచి తన్మతానుసారంబుగాఁ జక్రపాణిం బ్రతిష్ఠించి యనేకదానంబులం గావించియు ననేకశాసనంబుల వేయించియు నా బ్రాహ్మణులకుఁ బరమసంతోషప్రదంబులగు మఱికొన్నింటి సమర్పించియు వారిం గూర్చి దోసిలి యొగ్గి నిల్వఁబడి

చం॥ "నరుఁడని పూర్వజన్మమున నన్ను వచించెడివార, లొక్క భూ
సురునకు నాత్మజుండఁ, గడుసుందరమౌ బదరీవనంబునన్
జిరము తపంబొనర్చితిని, సిద్ధినిగాంచితి, నంతఁ బాండు భూ
వరసతి కుంతి గర్భమున వచ్చి జనించితి మానవుండనై, ౬౭౧

భుజంగప్రయాతము. జగత్ప్రసిద్ధమై రహింప శ్రద్ధ నస్మదాఖ్యతో
నగోపమానమైన యాలయంబుఁ గట్టఁజేసి యం
దగణ్యశోభమైన విగ్రహంబు నిల్పినాఁడఁ గా
నఁ గొల్వుఁడీరు చక్రపాణినా వచించుచున్ సదా, ౬౭౨

ఉ॥ సూర్యుఁడుఁ జంద్రుఁడున్ మఱియుఁ జుక్కలు వర్తిలుదాఁక నాదుపే
రార్యులు విష్ణులోకమున నవ్వహమున్ స్మరియింపఁ జేయుఁడీ,
భూర్యఘమిూఁగెడిన్, శయనబోధనవేళలఁ జైత్రమాసపున్
హార్యహమందు నుత్సవము నాచరితవ్యము మీకు భక్తిమై, ౬౭౩

చం॥ బదరినివీడి నేను బహుభక్తియుతంబుగ నీయుపేంద్రు స
త్పదములు పూజసేయుదును బ్రాహ్మణులార! మదుక్తమైన పై
యదనుల నీచతుర్భుజుని యర్చనచేయుజనం బఘంబులన్
వదలి వికుంఠలోకమున వాసముచేయుచునుండు పోయిగన్, ౬౭౪

కం॥ ఏవంవిధముగ మఱియును నీవిష్ణుక్షేత్రమందు నెసఁగెడి తత్త
ద్దైవతములఁ గడుభక్తిని సేవించెడిజనముగూడ శ్రేయముగాంచున్" ౬౭౫

వ॥ అనికీర్తించుటయును నమ్మహీసురులు వల్లెయని, రట్టు పాండునందనుండు తద్భరము వారలపైఁబెట్టి ప్రశాంతమైన యంతరాత్మతో నన్యతీర్థంబులును సేవించి కృతకృత్యుఁడయ్యె, హృషీకేశుం డిట్లు చక్రపాణివపుర్ధారియై జంతువుల పాపంబులం బోఁదోలుచు నందు వెలసియున్నవాఁ, డిప్పటికిని నవ్విష్ణుకల చైత్రాషాఢకార్తికైకాదశులం బూర్వోక్తవిధానంబునఁ బూజనీయుయు విశేషించి వందనీయుయు నయ్యెడి,

—• అప్సరఃకుండనిర్మాణము. •—

తే॥ అట్టిమహిమయొక్కటియుఁగల దాస్థలమున రూపతీర్థంబనంగడు రూఢమగుచు,
నటవిరూపుండు భక్తి నీరాడెనేని యగుసురూపుండు సరవి మహర్షులార! ౬౭౭

వ॥ తొల్లి లోకకర్తయు భగవంతుండును నగు బ్రహ్మ విస్తృతంబగు చతుర్విధసృష్టిం గావించి రూపసంపదాసంయుతయగు నొక్క దివ్యాప్సరసం బుట్టింప నుద్దేశించి సకలదేవతాశరీరంబులనుండియు నొక్కొక్క నువ్వుగింజయంత రూపంబును దీసి తన్నుఁగూడ మోహింపఁజేయఁగల యత్యాశ్చర్యకరశరీర సృజియించి కైలాసంబునకరిగి మహాదేవునకు నాహారోనర్చిరమ్మని యనుపుటయు నయ్యది సత్వరంబుగం బోయి పార్వతీపరివేష్టితుండగు శంకరుదర్శింప నతండును నావిడం గనుంగొని పరమాశ్చర్యభరితుండై పార్శ్వవర్తినిగు పర్వతరాజపుత్రివలని భయంబున ధృతదృష్టిం బఱపఁడయ్యె, నంత నయ్యప్సరసచ్చెకంటి మహేశ్వరునకుఁ బ్రణామంబొనర్చి శ్రద్ధాపురస్సరంబుగఁ గృతాంజలిపుటయై ప్రదక్షిణంబాచరించుడు నాదేవుండు తదాకృష్టలోచనుండై యామె యేదిక్కునకుఁదిరిగిన నాదిక్కునకెల్ల ముఖంబుగల్పించుకొని గౌరీభీతచిత్తంబునఁ గడంగడ నొకించుకయుం గదల్పకయె వర్తిల్లెఁగాని యాసమయమందందున్న నారదమహాముని హైమవతి కభివందనంబొనర్చి ౬౭౮

కం॥ “నీమగని కాముకత్వం బేమాదిరి నున్నయదియొ యీక్షింపు ముమా!
యీమగువ సొగసునంతయుఁ దా మొగములు నాలుగింటఁ దాలిచి కనెడిన్,

చం॥ జగములమూఁటఁ దివ్వటులు చాలరహిన్ వెలిగించి కాంచినన్
సొగసున నిన్నుఁబోలఁగల సుందరియుండదమి నే నెఱుంగుదున్,
మిగిలినవారికందఱికి మిక్కిలివేద్యమె యిద్ది, ప్రాణగల్
దగిలిచి మేనినిండఁ దెయితక్కను బోగము దెంత నీకడన్, ౬౮౦

శా॥ వారస్త్రీయఁట, పార్వతీసహితుఁడై వర్తించు గంగాధరున్
జేరన్ వచ్చినదంట, యామెపయిఁ దచ్చిత్తంబు లగ్నంబఁట
య్యారే! తానటునుండఁగానె శివుఁ డన్యాసక్తచిత్తుండుగా
గౌరీరూప మదెంతయంచుఁ గ్రతుభుక్కాంతల్ కడున్ నవ్వరే, ౬౮౧

చం॥ మనసటు నాటిపోయినది, మానక యాయన ప్రాజ్ఞకోటిచే
ననయము దూరముంచఁబడు నగ్గణికం దనమేడమీఁదనే
యునుపఁగలాఁడు, నీదుపని యుత్తదియేయిఁక, సిగ్గుచేతఁ గి
మ్మనక కిటుకూరుచుండెనిపు డంబరో! బెల్లముఁగొట్టు రాయినాన్” ౬౮౨

వ॥ అనిబోధసేయుటయు ముఖచతుష్టయంబుచే వికృతుండైయున్న నిజనాథు వీక్షించి యాపర్వతాత్మజ బిట్టుకోపంబున మహిషీధర్మమాశ్రయించినదై యాయన కన్నులన్నియుం గప్పివైచె, నంత నఖిలశైలంబులును విరిసిపోయె, సప్తసముద్రంబులును జెలియలికట్టలుదాఁటె, నట్లు ప్రళయంబుతోఁచుటయు నిమిషమాత్రంబున బ్రహ్మకు దినక్షయమై రాత్రిసంప్రాప్తించె, సకలంబును జలమయంబయ్యె, నంత భృంగినందిపురస్సరులగు సర్వగణంబులును దత్కాలహాళనుండును భయంపడి యాగురీశ్వరిదిక్కుమొగంబై ౬౨౩

కం॥ "విడువుము విడువుము జననీ! మృడుని కనులమూసి యేలమిడికింతుమమున్
విడువకయుండినచో నిప్పుడె నాశమునొందఁగలదు భువనత్రయమున్" ౬౨౪

వ॥ అనిప్రార్థించినను విడిచిపెట్టమిఁ బ్రాణంబులకంటె గరీయసియగు నాయుమను వారింపనేరక మహాదేవుండు లోకంబులపైఁగల కృపాళుత్వంబున లోకరక్షాకరంబై చెలంగ లలాటంబున నొకనేత్రంబు సృష్టించె, నంతదేవతలు ౬౨౫

ఆ॥ "త్ర్యంబకములచేత నలరారుచుంటచేఁ ద్ర్యంబకుండటంచు నధికభక్తిఁ
గీర్తనీయుఁడింకఁ గృత్తివాసుండుతా నఖిలసురనరోరగాదులకును" ౬౨౬

వ॥ అని వాక్రుచ్చి, రంతఁ బర్వతపుత్రిక యాదేవుని కనులమీఁది చేతులుదీసి కోపసంరక్తలోచనయై ముందఱనుండు తిలోత్తమం దిలకించి ౬౨౭

కం॥ "పాపాత్మురాల! యుష్మద్రూపముచేతను విడంబితుండయ్యె నిసీ
నాపతి, నాలుగుమొగములు ప్రాపించె, విరూపవగుచుఁ బడియుండుము మిఁకన్"

వ॥ అని శపించుటయు

సీ॥ చతికిలఁబడి చూడఁ జాల నసహ్యమై జలుఁబునీళ్ళుస్రవించు చట్టిముక్కు
విరియఁబాఱినయట్టి కుఱుచవెండ్రుకలతోఁ జెలువుచు గోల్పోవు చిట్టనెత్తి
నిసువులు బెదరిపో నిమ్నోన్నతములౌచుఁ బాచిపీడని పెద్ద బఱ్ఱపండ్లుఁ
గుండేఁడు ముదిజోన్నకూడేని క్షణములోఁ బట్టింపఁదగినంత బానకడుపుఁ
గలిగి యొకనిమేష కాలంబులోపలఁ జారుదేహమెల్ల మాఱిపోవ
వేపమానయగుచు నాపె యాపార్వతి కెఱఁగి దోసిలొగ్గి యిట్టులనియె, ౬౩౦

చం॥ "ననుసృజియించి లక్షణమె నల్వ గిరీశునకుక్ భవానికిక్
బ్రణతియొనర్చి రమ్మనుచుఁ బంపఁగ వచ్చినదానఁగాని నీ
పెనిమిటిమీఁదికోర్కెఁ బ్రభువపెట్ట సమాగతఁగాను, దోషహీ
నను శపియించితంబ! యిది న్యాయముకాదు, మరల్పుశాపమున్" ౬౩౧

వ॥ అని యిట్లు వేడుటయు సత్యంబును దీనంబును నగు తద్వాక్యంబును విని భవాని పశ్చాత్తాపసమేతయై ౧౯౨

తే॥ "స్త్రీస్వభావమునను జేసి శీఘ్రకోప మాగతంబయ్యె, నగుఁగాక యరుగు దెమ్ము,
భూస్థలంబున కిప్పుడే పోద, మచటఁ గలదు రూపదమనుతీర్థ మలఘు వబల! ౧౯౩

ఆ॥ మాఘసితతృతీయ మజ్జనమొనరింప నేరుపఱచియుంటి నేనె దాని,
బోయి దానఁ బ్రొద్దుపొడువకమున్నె నీ రాడు చేడె సుందరాంగియగును, ౧౯౪

కం॥ నిరతము మాఘతృతీయను జరుపుదుఁ దత్తీర్థమందు స్నానము, నేఁడా
వరతిథి; యచటికి స్నానముకొఱ కేగఁగ నిశ్చయించుకొంటిని గలికీ!" ౧౯౫

వ॥ అని చెప్పి యాతిలోత్తమను హాటకేశ్వరక్షేత్రమందలి రూపతీర్థమునకుఁ దోడ్కొనిపోయి విధిపూర్వకంబుగా మొదటఁ దాఁ దీర్థంబాడి యావిడచేత నాడించుటయుఁ దత్క్షణము యాభామిని యథాపూర్వంబుగాఁ గాంతియుతయై సంతసించి సురేశ్వరికిఁ గేలు మోడ్చి యాశ్చర్యపడుచు హర్షగద్గదభాషణంబుల నిట్లనియె, ౧౯౬

కం॥ "మున్నున్నయట్టి నాదగు సన్నుతరూపంబు నాకు సమకూరెను గా
నన్నలువపట్టణమునకు నున్నతిమెయి నేగుదాన నోసఁగు మనుజ్ఞన్" ౧౯౭

వ॥ అనియిట్లు వక్కాణించుటయు గౌరి ౧౯౮

కం॥ "ఏదేని యొక్కవరమును నీఁదలఁచినదాననీకు నిందునిభాస్యా!
నాదగుదర్శన మెపుడును గాదు వృథా, కోరుకొమ్ము గ్రక్కున, నిత్తున్" ౧౯౯

వ॥ అనినవిని తిలోత్తమ మతియిట్లనియె, ౨౦౦

కం॥ "నేనీక్షేత్రములోన భవానీ! నా పేర నొక్కవరతీర్థంబున్
వే నిర్మింపఁగఁ దలఁచినదానను, ఖ్యాతంబొనర్పు ధరనద్దానిన్, ౨౦౧

తే॥ అఖిలకాంతలు రూపభాగ్యములు గలిగి యలర నటఁ గూడ వర్షాంతమందు నీవు
స్నానమొనరించుచుండఁ గాఁ జను మహేశి! కరుణ సేయుమి దే నాకు ఘనవరంబు"

వ॥ అని ప్రార్థించుటయుఁ గ్రమ్మఱ గౌరీదేవి ౨౦౩

ఆ॥ "చైత్రసితతృతీయ సర్వదా మధ్యాహ్నమునను నీదు తీర్థమునను స్నాన
మాచరించుదాన నఖిలకాంతాజనక్షేమమునకు నీవు చెప్పినట్లు, ౨౦౪

ఉ॥ ఎవ్వతె యాతృతీయఁ గర మెక్కుడు భక్తిని నేగుదెంచి తా
నివ్వరతీర్థమందునను నెంతయు నా చరితావగాహయౌ
నవ్వనితా శిరోమణి సుఖాన్విత రూపసమేత గూడనై
నివ్వటిలున్ సమస్త రమణీస్పృహణీయతమై ధరాస్థలిన్, ౨౦౫

కం॥ పురుషుం డేనియు నెవఁ డవ్వరతీర్థమునను మునుంగు వాఁడును సప్తో
త్తరజన్మంబుల సుఖియును దరుణీభ్రమకృత్సురూపధరుఁడును నగుఁదాన్" ౨౦౬

వ॥ అని వాక్రుచ్చుటయు నయ్యవ్వగమచ్చెకంటి పిస్తీర్ణంబును విమలోదక
పూరితంబును నగు నొకకుండంబు ద్రవ్వించి తత్సవిధంబునఁ బార్వతిం బ్రతిష్ఠించి
సంతుష్టాంతరంగయై బ్రహ్మలోకంబునకుఁజనియె, నది మొదలుకొని యయ్యప్సరః
కుండంబు స్నానమాత్రంబున సకలజనులకును సౌభాగ్యంబొసంగుచును జలజాక్షులకు
విశేషించి సంతతిప్రదమగుచును జగత్ప్రఖ్యాతంబయ్యె ! ౨౦౭

శా॥ ఏమీనాంబక భక్తి రూపమయమౌ నీ యప్సరః కుండమం
దామూర్థంబును దీర్థమాడి సితికంఠాంగి దర్శించి యి
ట్లే ముమ్మాఱులొనర్పఁ దత్తణమ యాయేణాక్షి జన్మాదిగాఁ
దా మున్ జేసిన ఘోరపాపములచేతన్ ముక్తయై క్రాలెడిన్, ౨౦౮

వ॥ అచ్చటనే గౌరీకుండసమీపమం దాయమ కింకరియగు జయ యొకకుండ
మేర్పఱచియున్నయది, తృతీయాదివసంబునం దందుఁ గృతాభిషేకయగు నబల సంతతి
సౌభాగ్యసంపన్నయుఁ బతివల్లభయు నయ్యెడి, నట్లందు విజయాకుండమని మఱి
యొక తీర్థంబునుం గల, దందు గొడ్డురాలైనను స్నానమొనర్చిన బిడ్డలంగని స్వప్న
మందైనను బుత్రమరణదుఃఖంబును గాని పుత్రవియోగదుఃఖంబును గాని పొందకుండెడుఁ
గాక వంధ్యయైనను దత్తీర్థంబునం గ్రుంకఁ బెక్కండ్రు కొడుకులంబడసి స్వర్గంబున
వసించు"నని యిట్లు నొడువుటయు ఋషీశ్వరులు ౨౦౯

కం॥ "శుద్ధాంతఃకరణులు ప్రతిషిద్ధప్రాణివధులైన క్షితిసురులకు సం
సిద్ధి తడవైనయప్పటి కుద్ధతి సమకూరుమార్గ మొగిఁ జెప్పఁగదే" ౨౧౦

వ॥ అని వక్కాణించుటయు మరల సూతుండిట్లనియె, ౨౧౧

ఆ॥ "మాఘమాసమునను మౌని విశ్వామిత్రు హ్రదములో నుపస్సునందుఁ గ్రుంకి
ద్విజున కధికభక్తిఁ దిలపాత్రమిచ్చుచో బ్రహ్మలోకమొందుఁ బాపమెడలి, ౨౧౨

వ॥ మఱియు సుపర్ణేశ్వరు మ్రోల నుపవసించి ప్రాయోపవేశంబునఁ బ్రాణంబులు
వదలువాఁడు జన్మరహితుండగ్యుడు, నియ్యది బ్రాహ్మణులకు దేవతలుగూడ మెచ్చఁ
దగు సాత్త్వికసిద్ధులు, తక్కుటితీర్థంబులును దక్కుటి దేవాలయంబులును స్వర్గప్రదంబులే
కాని మోక్షదంబులు కానేరవు, సకలతీర్థంబులవలనను సకలదానంబులవలనను గలుగు
ఫలంబును శ్రద్ధాసమన్వితులై యీయాఖ్యానంబు శ్రవణించువారు కాంచుదురు, జను
లేతచ్ఛ్రవణంబువలన జన్మకోటి సంసిద్ధంబులగు కలుషంబులు వదలి నూఱుతరముల
వారి నుద్ధరింపఁగలుగుదురు, శ్రవణాంతంబున గోభూహిరణ్యవస్త్రాలంకారాది వివిధ
దానంబులం గథకుండు పూజనీయుం, డెవఁడట్లు పూజించు వాఁడు సాక్షాత్సత్యవతీ
సూనుండగు వేదవ్యాసుఁ బూజించినవాఁడేయగు, ౨౧౩

౮ చేలూరి రామన్నగుప్తగారు, సదాశివునిపేట
౯ రాచూరి సుబ్బయ్యగారు - శ్రీ శ్రీ విరూపాక్షసంస్థాన ప్రధానమంత్రి
౧౦ ఘంటుంభట్లగారి వెంకటభుజంగముగారు - ముసలాపురం
౧౧ దండు గుండేరావుగారు, కరణము - ముసలాపురం
౧౨ తిగుళ్ళ కృష్ణారెడ్డిగారు. పటేలు - ముసలాపురం
౧౩ కాకుమాను హనుమయ్యగారు, నర్సారావుపేట
౧౪ తిప్పరాజు కామేశ్వరరావుగారు, కరణం, దుగ్గిరాల
౧౫ భాస్కరరాయని వెంకట రామయ్యగారు, వంగపల్లి
౧౬ నరసింహస్వామివారు, యాదగిరి
౧౭ బీరకాయల హనుమంతరావుగారు, రాయగిరి
౧౮ పాలపర్తి గోపాలకృష్ణయ్యగారు, బెజవాడ
౧౯ జూలూరి వెంకటరత్నముగారు, వకీలు, గుంటూరు
౨౦ తుమురుగోటి నరసింహారావుగారు, తిరుమలగిరి.
౨౧ మెదక్ కిషన్‌రావు దేశముఖుగారు, నల్లపల్లి
౨౨ నార్నెపాటి వెంకటసుబ్బారావుగారు, నర్సాపురం
౨౩ జానపాటి సుబ్రహ్మణ్యంగారు, ఆక్టింగు కరణం, పాపయపాలెము
౨౪ చిక్కరాజు మట్టపల్లి రావుగారు, కరణం, చెలకుర్తి
౨౫ కవులూరి నరసింహారావుగారు, ఈలపోలు
౨౬ గోటేటి వేణుగోపాలరావుగారు, పోలీసుసబిన స్పెక్టరు, ప్రత్తిపాడు
౨౭ నడింపల్లి నరశింహారావుగారు, రిజెస్ట్రాఫీసు క్లార్కు, క్రోసూరు
౨౮ రాచకొండ వెంకటరామయ్యగారు, యెనమదల
౨౯ నారపరాజు వెంకటలక్ష్మీనరసింహారావు దేశముఖుగారు - తిమ్మవరం
౩౦ కప్పగంతు సుబ్బారావుగారు - పోలీసుసబిన స్పెక్టరు - పిడుగురాళ్ళ
౩౧ మండ చినవెంకయ్యగారు, దండమూడి.
౩౨ శ్యామాపంతులగోపాలరావుగారు-బందోబస్తు మొహతెమీన్-వరంగల్లు
౩౩ తిరుమలనల్లాన్ చక్రవర్తి వరదాచార్యులఅయ్యవార్లంగారు-శాతాపురం
౩౪ కన్నయ్యగారిసంగయ్యగారు-ముసలాపురం
౩౫ చక్కలం పాపయ్యగారు-ముసలాపురం
౩౬ తాళ్ళవలిమె లింగన్న మొకద్దంగారు-గడ్డిపెద్దాపురం
౩౭ కిషన్ రావు దేశపాండ్యాగారు- తాళ్ళపల్లి
౩౮ వెంకటరాజయ్య మక్తేదారు, సీతారాంపురం.
౩౯ తొర్లకొండ లక్ష్మారెడ్డిగారు, క్షీరసాగరం.
౪౦ కొత్వాలి వెంకటేశ్వరరావుగారు, సంగెం
౪౧ రంగరాజు గోపాలకిషన్ రావు దేశముఖుగారు, పాపురం

అభినవసరస్వతి.

పత్రికాధిపతి:— జానపాటి పట్టాభిరామశాస్త్రి.

ఇది యొకమాసపత్రిక. ఇందు వర్ణాశ్రమధర్మబోధక గ్రంథములును విమర్శనములును వ్యాసములును ప్రకటింపఁబడును. చందా సం॥ 1 కి రు 3—0—0

ఈ కార్యస్థానమున వెలకుదొరకు పుస్తకములు.

1	కరిణీకోద్ధారిణి [పూరె వీరభద్రకవి]	...	0	4	0
2	వాసంతికాపరిణయ నాటకము	...	0	4	0
3	కంసవధ నాటకము	...	0	8	0
4	చమత్కారమంజరి (సింహాద్రి వెంకటాచార్యులు)		0	4	0
5	విరూపాక్షపీఠగురుపరంపర	...	0	2	0
6	నీతిగీతలు (సుమతిశతకమునకు సంస్కృతము)	...	0	2	0
7	విశ్వబ్రాహ్మణశబ్దఖండనము, బ్రాహ్మణశబ్దవిచారము		0	2	0
8	విగ్రహారాధన ఖండనఖండనము	...	0	4	0
9	చిత్తూరుజిల్లాతీర్పు విమర్శనము (పత్రికాధిపతి)	...	0	4	0
10	సంగదోషము	...	0	3	0
11	పుళిందావివాహము (పత్రికాధిపతి)	...	0	4	0
12	వత్సలనీతిశతకము	...	0	1	0
13	శివానందలహరి (తంగెడ రామకృష్ణకవి)	...	0	4	0
14	నర్సారావుపేట శతావధానము (తిరుపతివెంకటీయము)		0	3	0
15	పశ్యాంపుశ్యాం	...	0	2	0
16	పశ్యశబ్దవిచారము	...	0	2	0
17	పురశ్చరణము	...	0	2	0
18	శంతనురాజచరిత్ర	...	0	14	0
19	వర్ణవ్యవస్థ	...	0	4	0
20	స్వర్ణకారవ్యవహారము	...	1	8	0
21	శుద్ధాంధ్రహరిశ్చంద్ర చరిత్రము	...	0	10	0
22	తిరుపతివెంకటేశ్వరతత్త్వము	...	0	1	0
23	నూతసంహిత-ఆంధ్రము	...	2	0	0
24	స్కాందమహాపురాణాంతర్గతనాగరఖండము (౧ సంపుటము)		1	0	0
25	డిటో నాగరఖండము (౨ సంపుటము)		1	8	0
26	భారతీయప్రబోధము (పిశుపాటి చిదంబరశాస్త్రి)		0	4	0

అభినవసరస్వతీ కార్యస్థానము,
జానపాడు, పిడుగురాళ్ళపోస్టు,
గుంటూరుజిల్లా.